క్లుప్తంగా

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



బయ్యారం: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సబ్‌డివిజన్ కార్యదర్శి మోకాళ్ల మురళీకృష్ణ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకానికి నిధులు కేటాయించకుండా పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు భిక్షం, నాగేశ్వరరావు, సంగన్న, మురళి, మంగీలాల్, ఐలయ్య, విశ్వనాథం, లింగమల్లు, హనుమ, శేషు, రాకేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆలోచనకు పునాదులు వేద్దాం



నెల్లికుదురు : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులకు అందరూ సహకరించి ప్రభుత్వ ఆలోచనకు పునాలుదులు వేద్దామని ఎంఈఓ గుగులోతుయ రాము అధికారులు, హెచ్‌ఎంలు, వీఓఏల కమిటీ సభ్యులకు సూచించారు. మండల కేంద్రంలోని టెంపుల్ కాలనీ పాఠశాల పనులను సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంధ్యారాణి, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

గోదాముల్లో తనిఖీలు



బయ్యారం : మండలంలోని పలు ఫర్టిలైజర్స్, సీడ్స్ షాపుల గోదాముల్లో సోమవారం మండల టాస్క్‌ఫోర్స్ టీం తనిఖీలు నిర్వహించింది. ఏఓ రాంజీ, ఎస్సై ఉపేందర్ డీలర్లతో మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలనే రైతులకు విక్రయించాలని తప్పనిసరి గా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. తనిఖీల్లో టీం సభ్యులు సురేష్, రమేష్ ఉన్నారు.

ప్రతిభావంతురాలికి సన్మానం



కురవి: స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కి చెందిన విద్యార్థిని భూక్య మహేశ్వరీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఎస్టీ కేటగిరిలో 107 ర్యాంకు సాధించడంపై పాఠశాల ప్రిన్సిపాల్ మార్త సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినీత్‌కుమార్‌కు 956వ ర్యాంక్

దోర్నకల్ : దోర్నకల్‌కు చెందిన ఓ విద్యార్థి జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో జాతీయస్థాయి ఎస్టీ కేటగిరిలో టి. వినీత్‌కుమార్ 956వ ర్యాంక్ సాధించాడు. జాతీయస్థాయి ర్యాంక్ సాధించిన వినీత్‌కుమార్‌ను బ్రిలియంట్ హై స్కూల్ కరస్పాండెంట్ అప్పారావు, ప్రిన్సిపాల్ అప్పరాబేగం తదితరులు అభినందించారు.

రామోజీకి ఘన నివాళి



మహబూబాబాద్ రూరల్ : జిల్లా న్యూస్ పేపర్స్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతిపై సోమవారం మౌనం పాటించి నివాళులర్పించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యూస్ పేపర్స్ డిస్టిబూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిడుదుల గోపాల్, ఉపాధ్యక్షులు బానోత్ శంకర్, రంగు సురేష్, ప్రధాన కార్యదర్శి నూకల శ్రీనివాస్, సత్య ప్రసాద్, ఏజెంట్లు సర్క్యులేషన్, ప్రకటనల విభాగం ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్ : రామోజీరావు మృతిపట్ల పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్, పేపర్‌బాయ్స్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, ఉపాధ్యక్షులు శంకర్, సురేష్, ఎస్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా అంతర్గత రోడ్లు

- గ్రామాల్లో రహదారులన్నీ బురదమయం
- వానాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం
- అభివృద్ధిపై దృష్టి సారించని అధికారులు



బాల్నిధర్మారం ప్రధానరహదారి గుంతల్లో నిలిచిన మురుగునీరు



వాల్యతండ గుంతలమయంగా ప్రధాన రోడ్డు

మరిపెడ రూరల్ : మండలంలోని పలు గ్రామాలు బురదమయంగా ఉండడంతో అంతర్గత రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన గాలికి వదిలేశారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు గృహాల్లో నుంచి వెలుబడుతున్న మురుగునీరు రహదారుల్లో ప్రవహిస్తున్నాయి. మురుగునీటితో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. అయినప్పటికీ గుంతల్లో తట్టెడు మట్టి పోయకపోవడంతో రోజుల తరబడి మురుగునీరు రోడ్డుపై నిలిచి ఉంటోంది. అలాగే పలు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లపై కూడా మురుగునీరు ప్రవహిస్తుంది. మండలంలోని బాల్నిధర్మారం, వాల్యతండ గ్రామ పంచాయతీల్లోని ప్రధాన రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడి మురుగునీరు నిల్వ ఉంటుంది. దంటకుంటతండ గ్రామంలోని సీసీ రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గాడి తప్పిన అధికారుల పాలన

ఈ ఏడాది జనవరి నెలతో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామాలకు మండల స్థాయి అధికారులను నియమించి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభించారు. ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శుల కోఆర్డినేషన్‌తో గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాల్సి ఉంది. కానీ కొందరు ప్రత్యేక అధికారులను నియమించిందే గుత్తా కనీసం గ్రామాలవైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి. పలు గ్రామాల్లో అధికారులను పాలనపై నిలదీస్తే గ్రామపంచాయతీల్లో నిధులు లేవని సమాధానం చెబుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

వ్యాధులు ప్రబలే అవకాశం..

వానకాలం ప్రారంభమైనందున వర్షాలు కురవడంతో గ్రామ అంతర్గత రహదారుల్లో నీళ్లు నిలిచి దోమలు, ఈగలు వ్యాపిస్తాయి. ఈ కారణంగా వ్యాధులు వ్యాపించే అవకాశం లేకపోలేదని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు గ్రామపాలనపై దృష్టిసారించి రహదారులను వెంటనే మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, అధికారులు

మహబూబాబాద్: డ్రెయినేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులను సోమవారం చైర్మన్, అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, డీఈ సీహెచ్ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సక్రు



గార్ల: ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జి సక్రును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కొత్తగూడెంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఏఐటీఎఫ్ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘం రాష్ట్ర కమిటీకి సక్రు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర మంత్రులను కలిసిన నాయకులు



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

దంతాలపల్లి : మండలంలోని బీజేపీ నాయకులు సోమవారం కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కిన బీజేపీ ఎంపీలు కిషన్‌రెడ్డి, సహాయ మంత్రిగా చోటు దక్కిన బండి సంజయ్‌లకు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. కలిసిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యాదర్శి చీకటి మహేష్, లక్ష్మణ్, మదన్, తదితరులు ఉన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

కురవి: కేంద్రంలో ప్రధాని మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని గుడిసెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పార్టీ శ్రేణులు బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కొణతం పెంటయ్య, నాయకులు కోడి రామకృష్ణ, శంకర్‌రావు, వెంకటేష్, కాశీ, సుమన్, రాంజీ, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

లబ్ధిదారులను ఎంపిక చేస్తాం

దేవరుప్పుల: నిబంధనల మేరకు త్వరలో డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేస్తామని తహసీల్దార్ హుస్సేన్ వెల్లడించారు. మండలంలోని ధర్మాపురం, కామారెడ్డిగూడెం, కడవెండిలో గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన 93 ఇళ్లలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు ఇళ్లను దురాక్రమణ చేయగా అధికారులు సందర్శించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

నల్లా కనెక్షన్ ఇవ్వాలి

పాలకుర్తి: తాగు నీటికి సమస్య తలెత్తకుండా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇవ్వడానికి ఉద్యోగులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాములు అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఈఓ మాట్లాడారు. కొడకండ్ల ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, సూపరింటెండెంట్ పుష్పలత, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముందస్తు సస్యరక్షణతో కలుపు నివారణ

కొడకండ్ల: విత్తనాలు వేసిన 48 గంటల్లోపు ప్రీ ఎమర్జెన్స్ హెర్బిసైడ్స్ స్ప్రే చేసుకోవాలని తద్వారా కలుపును నియంత్రించవచ్చని మండల వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి సూచించారు. మండలంలోని హక్యాతండాలో వరి నారుమడులను ఆయన సోమవారం పరిశీలించి రైతులకు సూచనలు, జాగ్రత్తలను వివరించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నెల్లికుదురు: ఆర్థికసాయం అందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు



గార్ల : ఆర్థికసాయం అందజేస్తున్న తోటి ఉపాధ్యాయులు

నెల్లికుదురు: మండలంలోని ఆలేరు జెడ్పీహెచ్‌ఎస్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భూక్య కిషన్ ఇటీవలే మృతి చెందాడు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూ.55 వేలు పోస్టల్ డిపాజిట్ చేసి అందించారు. పరామర్శించిన వారిలో జిల్లా సంఘం అధ్యక్షుడు కొమ్ము రాజేందర్, గౌరవ అధ్యక్షుడు నాగయ్య, సెక్రటరీ జ్యోతి, ఐలయ్య, వెంకటయ్య, విజయ, శంకర్, ప్రభాకర్, సునిల్, శ్రీనివాస్, బిక్షపతి పాల్గొన్నారు.

గార్ల: మండలకేంద్రంలోని విశ్వశాంతి విద్యాలయంలో ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గుండెపోటుకు గురై మృతి చెందిన మల్లికంటి నర్సయ్య కుటుంబ సభ్యులకు పాఠశాల యజమాని, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, రిటైర్డ్ ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారి గంగావత్ రాంసింగ్, ఎస్‌కె బాబా, తోటి ఉపాధ్యాయులు కలిసి సోమవారం రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం బీరవెల్లి సంజీవరెడ్డి మాట్లాడుతూ మృతుడి ఇద్దరు పిల్లలకు 10వ తరగతి వరకు ఉచితంగా విద్య అందిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు పి రమేష్, వి శ్రీనివాస్, మునీర్ ఉన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో డీటీ బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. అదే విధంగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరి చేయాలని, మహిళలకు రూ.2,500లు అందించాలని డిమాండ్ చేశారు. వెంకన్న, రాజు పాల్గొన్నారు.

స్తంభాలు పాతారు.. తీగలు మరిచారు



తీగలు లేకుండా అమర్చిన కరెంటు స్తంభం

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెంలోని ఎర్రగడ్డ కాలనీలో మూడేళ్ల క్రితం విద్యుత్ స్తంభాలను పాతి వాటికి తీగలను అమర్చడం మరిచారు. స్తంభాలతోపాటు తీగలను అమర్చడంలో అధికారులు మరచిపోవడంతో అంధకారంలో ఉండాల్సి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్తంభాలకు తీగలను ఏర్పాటు చేసి విద్యుత్ వెలుగులు అందించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ విజేత హైదరాబాద్ జట్టు



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న సీఐ ఉపేందర్‌రావు

దోర్నకల్: మండలంలోని గొల్లచర్లలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో హైదరాబాద్ జట్టు విజేతగా నిలిచింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 36 జట్లు పోటీపడగా హైదరాబాద్ జట్టు విజేతగా నిలవగా ప్రకాశం జట్టు రెండో స్థానంలో నిలిచింది. తహసీల్దారుబంజర, విజయవాడ, కరీంనగర్, గొల్లచర్ల తర్వాత స్థానాల్లో నిలిచాయి. డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు విజేతలకు నగదుతో పాటు షీల్డ్‌లను ప్రదానం చేసిన అనంతరం మాట్లాడుతూ గొల్లచర్లలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన క్రీడాకారులున్నారని తెలిపారు. క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించిన నిర్వాహకులను సీఐ అభినందించారు. అనంతరం సీనియర్ కబడ్డీ క్రీడాకారులు, పీఈటీలు, నిర్వాహకులను సీఐ సన్మానించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు భీమనబోయిన సంతోష్, యాదగిరి, సీహెచ్ ఉప్పలయ్య, ప్రసాద్, పి.రామకృష్ణ, సీహెచ్ శ్రీనివాస్, జి.సురేష్, సీహెచ్.మహేష్, సాగర్ పాల్గొన్నారు.

మిల్లెట్లు ఆరోగ్యకరమైన ఆహారం



మిల్లెట్స్ రీసెర్చ్ కేంద్రాన్ని సందర్శించిన మహిళలు

పెద్దవంగర: ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈఓ తాళ్లూరి లత అన్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ కేంద్రానికి సోమవారం మండలంలోని ఉప్పరగూడెం నుంచి 45 మంది మహిళలు నాబార్డు సాకారంతో లక్ష్యం ఎన్‌జీఓ ఆధ్వర్యంలో వెళ్లారు. ఈ సందర్భంగా మిల్లెట్స్‌తో తయారవుతున్న ఉత్పత్తులు తెలుసుకోవడానికి చిన్నవంగర, పెద్దవంగర, ఉప్పరగూడెం గ్రామాలను నుంచి వెళ్లినట్లు లత తెలిపారు. గ్రామాల్లో నిరంతరం ప్రజలకు ఆహార అలవాట్లపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన పోషకాలపై తీసుకోవాలని వివరిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ శంకర్, ప్రతినిధులు కవిత, సుమలత, రమ, ఝాన్సీ, మహిళలులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాలు.. దేవాలయాలు



గూడూరు : ర్యాలీలో మాట్లాడుతున్న స్వామి

మహబూబాబాద్ రూరల్ : విద్యాలయాలు గ్రామ చైతన్యానికి దేవాలయాలు లాంటివని, వాటిని పరిరక్షించకపోతే భవిష్యత్‌లో విద్యార్థులు ఆగమయ్యే పరిస్థితి ఉందని గుండాలగడ్డ తండ మాజీ సర్పంచ్ దస్మ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగామండలంలోని అమనగల్ జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్‌ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వారి పరిధిలోని గుండాలగడ్డ తండాలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి సోమవారం ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను గురించి వివరించారు. నూతనంగా 15 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. హెచ్‌ఎం గుగులోతు సత్య శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పర్వతగిరి ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న బడిబాట

డోర్నకల్ : మండలంలోని డోర్నకల్, బొడ్రాయితండా, ముల్కలపల్లి తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. బొడ్రాయితండా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మారెడ్డి, అజీజ్, సత్యనారాయణ, మాధవి తదితరులు గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ముల్కలపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రుక్మేంధర్‌రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.



డోర్నకల్ : మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

గూడూరు: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత తల్లిదండ్రులదేనని ఎంపీటీసీ కత్తి స్వామి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బాలుర, బాలికల హైస్కూళ్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సుజాత, సదాశివ, ఉపాధ్యాయ బృందం, సీఆర్‌పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పెద్దవంగర: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని పెద్దవంగర ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యం గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



సురేశ్ (ఫైల్)

పెద్దవంగర: మండలంలోని అవుతాపురం గ్రామ పరిధిలో పాలకుర్తి–నాంచారిమడూర్ రహదారిపై ఆదివారం సాయంత్రం కారు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన కుందూరు సురేశ్ (28) చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. సురేశ్ తల్లిదండ్రులు చిన్నతనంలోనే ప శ్చిమగోదావరి జిల్లా తణుకుకు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. కరోనా కాలంలో కుటుంబ సభ్యులు అంతా పోచంపల్లికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. అతను మాత్రం అక్కడ వలంటరీ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని అవుతాపురం గ్రామానికి ఓ శుభ కార్యం నిమిత్తం వచ్చారు. అన్నదమ్ములు రవీందర్, సురేష్ బంధువైన గద్దల అశోక్‌తో కలిసి గ్రామ శివారులోని రోడ్డు ప్రక్కన తమ ద్విచక్ర వాహనాలను ఆపి మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన దార కిషోర్ తన కుటుంబ సభ్యులతో దైవదర్శనానికి యాదగిరిగుట్టకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో అవుతాపురం గ్రామ శివారులోకి కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సురేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో హనుమకొండకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ తను మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో మెడికల్ షాపు దగ్ధం



కేసముద్రం: షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న మెడికల్ షాపు పూర్తిగా దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న వెంకటేశ్వర్లు ప్రథమ చికిత్స దవాఖానతోపాటు సాయిరాం మెడికల్ షాపులో సోమవారం తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో ఒక్కసారిగా శబ్దం వచ్చి మంటలు వ్యాపించాయి. రాత్రి సమయంలో గుర్తించిన కొందరు షాపు యజమానికి సమాచారం అందించారు. ఇంతలో సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే ఆసుపత్రి, మెడికల్ షాపులో మంటలు చెలరేగడంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది. మెడికల్ షాపులో ఉన్న ఉన్న ఫ్రీజ్, మెడిసిన్స్, కౌంటర్, ఫర్నిచర్, వైద్య పరికరాలు మంటల్లో పూర్తిగా కాలిబూడిదయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరి గినట్లు తెలుస్తుంది. సుమారు రూ.15లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు నరేష్ ఆవేదన వ్యక్తం చేశాడు.

గుర్తుతెలియని మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని కిలోమీటర్ నెంబర్ 435/13 వద్ద ఒక గుర్తుతెలియని మహిళ (45) మృతి చెందిందని డోర్నకల్ రైల్వేపోలీస్ ఇన్‌చార్జ్ ఎస్సై పి.భాస్కరరావు సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఈ సంఘటన జరిగిందని, ఆమె ఏదో గుర్తుతెలియని రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, మృతదేహాన్ని మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. ఎవరికైనా ఆమె ఆచూకీ వివరాలు తెలిసిస్తే డోర్నకల్ జీఆర్పీ ఎస్సై 87126 58600 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు



షాపుల యజమానులతో మాట్లాడుతున్న మంజుఖాన్

దంతాలపల్లి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ అన్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అ నంతరం మండలకేంద్రంలోని రైతు కేంద్రంలో ఎరువులు, విత్తనాల షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే ప్రతి విత్తనాలపై రశీదు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకే అమ్మకాలు జరుపాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష, దీక్షిత్, సందీప్, షాపుల యజమానులు పాల్గొన్నారు.